దర్జాగా కబ్జా

హైవే పక్కనున్న లక్షల విలువైన స్థలాన్ని ఆక్రమించిన మెకానిక్

- తొలుత 15 అంకణాల్లో మెకానిక్ షెడ్డు ఏర్పాటు
- ఏడాదిలోగా 50 అంకణాలు చెర
- పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. లక్షలాది రూపాయలు విలువ చేసే ఈ భూములను కొందరు దర్జాగా కబ్జా చేస్తున్నారు. వాటికి నకిలీ పట్టాలను సైతం సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్‌లో నెల్లూరు–ముంబై జాతీయ రహదారి పక్కన సర్వే నంబర్ 1912లో 17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో సుమారు ఎకరా భూమిని ప్రభుత్వం ఇళ్ల పట్టాలుగా పంపిణీ చేసింది. మిగిలిన భూమి ప్రభుత్వ ఆధీనంలోనే ఉంది. హైవే పక్కనున్న లక్షలాది రూపాయల విలువ చేసే ఈ ప్రభుత్వ భూమిపై కన్నేసిన మెకానిక్ తొలుత 15 అంకణాలను ఆక్రమించి మెకానిక్ షెడ్డు ఏర్పాటు చేశాడు. మెకానిక్ షెడ్డు ఏర్పాటు కోసం ప్రభుత్వానికి అర్జీ పెట్టుకోగా స్థలాన్ని మంజూరు చేసినట్లుగా మెకానిక్ చెబుతున్నాడు. అందుకు సంబంధించి ఓ పట్టాను సైతం చూపుతున్నాడు. వాస్తవానికి ప్రభుత్వం నిబంధనల మేరకు ఇళ్లులేని పేదలకు 9 లేదా 12 అంకణాలను మాత్రమే మంజూరు చేస్తుంది. అయితే ఈ మెకానిక్‌కు మెకానిక్ షెడ్డు నిర్వహణ కోసం ప్రభుత్వ స్థలాన్ని ఏ అధికారి మంజూరు చేశారో తెలియదు. ప్రస్తుతం అతని ఆధీనంలో 50 అంకణాలకుపైగా స్థలం ఉంది. తొలుత సుమారు 15 అంకణాల్లో మెకానిక్ షెడ్డు ఏర్పాటు చేశాడు. ఆ తరువాత దాని చుట్టూ మరమ్మతులకు గురైన ద్విచక్ర వాహనాలను పెడుతూ ఏడాదిలోగా 50 అంకణాలకుపైగా స్థలాన్ని ఆక్రమించి తనదేనని అందరికీ చెబుతున్నాడు. ఆక్రమించిన స్థలంలో సమీపంలోని వాగు కాలువ మట్టిని తోడి పోసి చదును సైతం చేశాడు. ఈ కారణంగా సమీపంలోని ఇళ్ల ప్లాట్లలో నీరు నిలిచి వాటి లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. హైవేకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలం అంకణం విలువ లక్ష రూపాయలకుపైగానే పలుకుతోంది. మెకానిక్ ఆక్రమించిన స్థలం విలువ రూ.50 లక్షలకుపైగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అంతటి విలువైన ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌ను వివరణ కోరగా, ఆక్రమణలను పరిశీలించి నోటీసులు ఇస్తామని తెలిపారు.



నెల్లూరు-ముంబై జాతీయ రహదారి పక్కనున్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన షెడ్డు

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులను సహించబోం



డీఎస్పీతో చర్చిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు కిరాతకంగా దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని, టీడీపీ నాయకుల దాడులను తాము చూస్తూ ఊరుకోబోమని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. కావలిలో ఆదివారం ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. బోగోలు మండలం ఏనుగులబావి పంచాయతీ పరిధిలోని కోళ్లదిన్నె గ్రామంలో ఆలయం విషయంలో ఎప్పుడో తలెత్తిన వివాదాన్ని మనసులో పెట్టుకుని టీడీపీ నాయకులు తమ వైఎస్సార్‌సీపీ నాయకుడైన పల్లెబోయిన శ్రీనివాసులురెడ్డి బైక్‌పై పోతుండగా మూడ్రోజుల క్రితం అడ్డగించి దాడి చేశారని తెలిపారు. టీడీపీ మూకల దాడిలో తీవ్ర గాయాలపాలైన శ్రీనివాసులురెడ్డి చికిత్స నిమిత్తం కావలిలోని ఏరియా ఆస్పత్రికి వచ్చారని చెప్పారు.అయినా టీడీపీ మూకలు వదిలిపెట్టకుండా కావలి ఏరియా ఆస్పత్రికి వచ్చి తమ పార్టీ నాయకుడిపై పది మంది బహిరంగంగానే అమానుషంగా దాడికి పాల్పడ్డారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులపై ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. టీడీపీ దాడుల నుంచి కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉన్నా ప్రేక్షకపాత్ర వహిస్తూ వారికే వత్తాసు పలుకుతుండడం దుర్మార్గమన్నారు.

పరామర్శ

టీడీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడి కావలి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లెబోయిన శ్రీనివాసులురెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను అడిగి దాడి ఘటనా పూర్వపరాలను తెలుసుకున్నారు. ఏడు నెలలుగా టీడీపీ నాయకులు తమ కుటుంబాన్ని హింసిస్తున్న విధానాన్ని వారు చెప్పడంతో కాకాణి చలించిపోయారు. టీడీపీతో ఇబ్బందులు ఉన్న గ్రామాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలుగా అధికారం అనుభవించిన తామే వచ్చి ఉండి వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. టీడీపీ నాయకులు కొట్టే దెబ్బలేవో తామే తింటామే కాని, నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులను గాలికి వదిలేయమన్నారు. కావలి ఎమ్మెల్యే ప్రోత్సాహంతో టీడీపీ మూకలు రెచ్చిపోతున్న వైనాన్ని, చేతులు దులుపుకొంటున్న పోలీసుల వైఖరిని కాకాణికి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి వివరించారు.

చట్టప్రకారం చర్యలు తీసుకోండి

కావలి ఏరియా ఆస్పత్రిలో శ్రీనివాసులురెడ్డిని పరామర్శించిన తర్వాత కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని డీఎస్పీ శ్రీధర్‌ను కలిశారు. టీడీపీ నాయకుల పాశవిక దాడులపై ఆయనతో చర్చించారు. బాధితులు చేసిన ఫిర్యాదులు, పోలీసు అధికారులు తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులపై దాడులకు పాల్పడిన టీడీపీ మూకలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్లుప్తంగా

సీసీకెమెరాలతో నేరాలు కట్టడి

అల్లూరు: సీసీ కెమెరాలతో నేరాలను కట్టడి చేయవచ్చని, ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై కిషోర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగల బారి నుంచి ఇళ్లను రక్షించుకోవచ్చన్నారు. సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకున్న తర్వాత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తామన్నారు. ఎప్పుడైన మీరు ఇంటికి తాళం వేసి బయటకు వెళితే మీ ఇల్లు పోలీసు నిఘాలో ఉంటుందని తెలిపారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం



వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడుకు చెందిన సంచిబోయిన మాల్యాద్రి గత కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మానవత సంస్థ సభ్యులు రూ.5వేలు నగదు సాయాన్ని ఆదివారం అందజేశారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మునలయ్య, బాబురావు, కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సభ్యులు కృష్ణయ్య, తిరుపతిరెడ్డి, నాగేశ్వరరావు, హరినారాయణ, దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత వెంగళరావునగర్ జట్టు



విజేతగా నిలిచిన వెంగళరావునగర్ జట్టు

ఉదయగిరి: వెంగళరావునగర్‌లో సంక్రాంతిని పురస్కరించుకుని ముత్యాలపాటి అబ్దుల్‌ఖాదర్ జ్ఞాపకార్థంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. విజేతగా నిలిచిన వెంగళరావు జట్టుకు రూ.30వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఉదయగిరి మెకానికల్ రాయల్ జట్టుకు రూ.20వేలు నగదుతో పాటు ట్రోఫీలను టోర్నమెంట్ నిర్వాహకుడు హనీఫ్ అందజేశారు. ఆటలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అబ్దుల్, మహ్మద్‌ఖాజా, గ్రామ పెద్దలు షేక్ రియాజ్, షరీఫ్ గుంటుపల్లి ఖాదర్‌బాషా, ముస్తఫా, గౌస్‌మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ మాస్టర్‌కు కళానిధి పురస్కారం



చేజర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్న కిషోర్ కుమార్‌కు కళానిధి పురస్కారం లభించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని సత్యసాయి కల్యాణ మండపంలో కోనసీమ చిత్ర కళా పరిషత్ ఆధ్వర్యంలో 35వ ఇంటర్నేషనల్ ఆర్ట్ కాంపిటీషన్ అవార్డుల ప్రదానోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కోనసీమ కళా పరిషత్ ఫౌండర్ కే సీతారామశాస్త్రి తనకు కళానిధి పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించినట్లు కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు సహచర ఉపాధ్యాయులు, స్నేహితు లు, బంధువులు అభినందనలు తెలిపారు.

ఐటా నూతన కార్యవర్గ ఎన్నిక



ఉదయగిరి: స్థానిక జమాతే ఇస్లామి హింద్ కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గ ఐడల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఫయాజ్, లియాఖత్‌అలీ, ఉపాధ్యక్షులుగా రఫి, ఖలీల్, సంయుక్త కార్యదర్శులుగా నాయబ్‌రసూల్, మసూద్, మదర్సా కార్యదర్శిగా సయ్యద్‌అఫ్రోజ్, కోశాధికారిగా నస్రుల్లా, గౌరవాధ్యక్షులుగా ఇస్మాయిల్‌సాహెబ్, ముఖ్య సలహాదారునిగా ఎస్ మున్నా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ఐటా మాజీ రాష్ట్రాధ్యక్షుడు అబ్దుల్‌రజాక్, మాజీ జాతీయ కార్యదర్శి షాకీర్‌హుస్సేన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

అల్లూరు: మండలంలోని సింగపేట గిరిజన కాలనీకి చెందిన ఆడిపూడి నారాయణ(56) ఆదివారం మరణించారు. ఆయన అంత్యక్రియల నిమిత్తం కేఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి రూ.3 వేలు నగదు సాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యుల ద్వారా నారాయణ కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. అంతిమ యాత్ర వాహనాన్ని ఏర్పాటు చేశారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

సంగం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ సూచించారు. సంగం సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు సంగం పోలీసు స్టేషన్‌లో సీఐ వేమారెడ్డితో కలిసి ఆదివారం ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లపై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత ప్రవర్తన తీరును వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సంగం సర్కిల్ పరిధిలో 101 మంది రౌడీషీటర్లు ఉన్నారని తెలిపారు. రౌడీషీటర్లు వివాదాల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు మంచి ప్రవర్తన కలిగి ఉంటే పరిశీలించి రౌడీషీట్‌లను తొలగిస్తామన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గంజాయి సేవనం, అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. సంగం, చేజర్ల, ఏఎస్‌పేట ఎస్సైలు పాల్గొన్నారు.

యోగి వేమనకు నివాళి



ఆత్మకూరురూరల్: వేమనకు నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ



ఉదయగిరిలో...

ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయంలో యోగి వేమన జయంతిని ఆదివారం నిర్వహించారు. యోగి వేమన చిత్రపటానికి ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచిన అభ్యుదయవాది, ప్రజాకవి, సంఘసంస్కర్త యోగివేమన అని కొనియాడారు. పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు, సీనియర్ అసిస్టెంట్ ఖాజానవాజ్, డీఈఓ ఇమ్రాన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో యోగి వేమన చిత్రపటానికి ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని మూఢనమ్మకాల నుంచి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దుతూ శతాబ్దాల క్రితమే అభ్యుదయ కవి యోగి వేమన రచనలు సాగించారన్నారు. ఆయన రాసిన పద్యాలు తెలుగు ప్రజల నోట ఆణిముత్యాలుగా శతాబ్దాలుగా నిలబడిపోవడం గొప్ప విషయమన్నారు. ఏఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలోని మూఢత్వాన్ని ఖండిస్తూ సులభశైలిలో వేమన రాసిన పద్యాలు ఎనలేని ప్రజాదరణకు నోచుకున్నాయన్నారు. ఈఓపీఆర్‌డీ డేవిడ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో గాడితప్పిన ప్రజాస్వామ్యం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామ్‌భూపాల్

ఆత్మకూరురూరల్: పెట్టుబడిదారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని దేశంలో ప్రజాస్వామ్యం గాడితప్పిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామ్‌భూపాల్ పేర్కొన్నారు. ఈ నెల 29న నెల్లూరులో సీపీఎం రాష్ట్ర మహాసభలు జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని పాతమున్సిపల్ కార్యాలయంలో పెట్టుబడి–ప్రజాస్వామ్యం అనే అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రజాజీవనం పెట్టుబడిదారుల కబంధ హస్తాల్లో చిక్కుకుందన్నారు. చివరికి దేశాన్ని శాసించే స్థాయికి పెట్టుబడుదారులు చేరుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ సైతం వారి కనుసన్నల్లోనే కొనసాగుతోందన్నారు. ఈ సదస్సులో సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, జిల్లా కౌలు రైతుల సంఘం నేత లక్ష్మీపతి, జిల్లా సెక్రటరియేట్ సభ్యులు మూలి వెంగయ్య, పార్టీ నాయకులు అన్వర్‌బాషా, లక్కు ప్రసాద్, హజరత్తయ్య, వాగాల శ్రీహరి, సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు, యూటీఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 23న ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాలరావు ఆదివారం తెలిపారు. ఎంపీపీ జీ వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

కోడిపందేల స్థావరంపై దాడి

జలదంకి: మండలంలోని చామదల శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఎస్సై లతీఫున్నీసా తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 4,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను సోమవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

తవ్వారు.. వదిలేశారు



రోడ్డును తవ్వి వదిలేయడంతో మార్జిన్‌లో వెళ్తున్న ద్విచక్ర వాహనచోదకుడు

కొండాపురం: మండలంలోని కొమ్మి పంచాయతీ పరిధిలోని రామానుజాపురం నుంచి పార్లపల్లి వరకు కొండాపురం–కావలి ఆర్‌అండ్‌బీ రోడ్డును ప్యాచ్ వర్కు పనుల పేరుతో తవ్వి వదిలేయడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతికి రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని చెప్పి కూటమి ప్రభుత్వం కొమ్మి పంచాయతీ పరిధిలోని రామానుజాపురం నుంచి పార్లపల్లి వరకు 11కిలోమీటర్ల మేర ప్యాచ్ వర్కు పనులు చేపట్టేందుకు హడావుడిగా రూ.25 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రాత్రికి రాత్రే అక్కడక్కడ రోడ్డును తవ్వేశారు. గుంతలు ఉన్న చోట వదిలేసి రోడ్డు బాగున్న చోట తవ్వకాలు చేపట్టారు. హడావుడిగా అక్కడక్కడ కొద్దిగా నాసిరకంగా ప్యాచ్‌వర్కు పనులు చేపట్టారు. ఆ తరువాత సంక్రాంతి రావడంతో పనులను వదిలేశారు. సంక్రాంతి పండగ ముగిసినా పనులను ప్రారంభించకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కజొన్నపై కత్తెర పురుగు దాడి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



ఆకులపై ఉన్న కత్తెర పురుగు

ఉదయగిరి : మండలంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు దాడి చేసి తీవ్ర నష్టాన్ని కలుగుజేస్తోంది. కత్తెర పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాధికారి ఆంజనేయులునాయిక్ సూచించారు. కత్తెర పురుగును గుర్తించడం, నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను ఆయన వివరించారు. కత్తెర పురుగు తిరగబడిన వై ఆకారంలో ఉండి నుదిటిపై తెల్లని చారలు ఉంటాయి. మొదట దశలో ఆకులపై ఉన్న పత్రహరితాన్ని గోకి తింటూ రంధ్రాలు చేస్తాయి. పురుగులు పెరిగే కొద్దీ ఆకులను చివరి నుంచి తింటాయి. దీంతో ఆకులు కత్తిరించినట్లు కనిపిస్తాయి. ఆకు సుడులు, కాండాన్ని తొలచి రంధ్రాలు వేసి పంటకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. దీని నివారణకు ఎకరాకు లీటరు వేపనూనె లేదా 5 శాతం వేప కషాయాన్ని పిచికారీ చేయాలి. తొలిదశలో గొంగళి పురుగును నివారించుటకు ఎకరాకు 500 మి.లీ క్లోరోఫైరీపాస్ మందును పిచికారీ చేయాలి. దీని ఉద్ధృతి ఎక్కువగా ఉంటే బెంజోయేట్ 5ఎస్‌డీ 80 గ్రాములను అవసరాన్ని బట్టి రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలి. రైతులు నిశితంగా పంటను గమనిస్తూ అవసరాన్ని బట్టి మందులు పిచికారీ చేస్తూ నష్ట నివారణ చేపట్టవచ్చు.

ట్రాఫిక్‌తో సతమతం



పంచాయతీ బస్టాండ్ వద్ద నిలిచిన ట్రాఫిక్

ఉదయగిరి: పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఇక్కడ దుకాణాల వద్ద వాహనాలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. ఆర్టీసీ బస్సులను సైతం రోడ్డుపైనే నిలుపుతున్నారు. కావలి, బద్వేలు వైపు వెళ్లే బస్సులను ట్యాంక్‌బండ్‌పై ఆపుతున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకంగా కలుగుతోంది. నిత్యం ఇదే పరిస్థితి ఉంటుండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించి రాకపోకలు సజావుగా సాగేలా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

సోమశిల: అనంతసాగరం మండలంలో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గత కొద్దిరోజులుగా రాత్రి వేళల్లో చాటుమాటుగా మట్టిని తరలిస్తున్న కూటమి నాయకులు ఆదివారం బరితెగించి పట్టపగలే అక్రమ రవాణాకు తెరతీశారు. మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాను కట్టడి చేయాల్సిన అధికారులు తమకు ఫిర్యాదులు అందలేదంటూ తమ బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని కొత్తపల్లి, వెంకటరెడ్డిపల్లి, ముత్తుకూరు, తదితర గ్రామాల్లోని ప్రైవేట్ భూముల నుంచి రెవెన్యూ, మైనింగ్ అనుమతుల్లేకుండానే మట్టిని అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి ట్రక్కుకు రూ.500 నుంచి రూ.800 వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు అక్రమార్కులు అధికారులు, రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకుని తమకు ఎదురే లేదన్న ధోరణిలో మట్టి అక్రమ రవాణాను సాగిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అక్రమ తవ్వకాలపై మీడియాలో కథనాలు వెలువడుతున్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారు. మరోవైపు గ్రామాల్లో మట్టి రవాణా చేసే ట్రాక్టర్లు అతి వేగంగా వెళ్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు హడలిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై అనంతసాగరం తహసీల్దార్‌ను సంప్రదించగా మట్టి రవాణాతో తమకు సంబంధం లేదని, ఇరిగేషన్ అధికారులు చూసుకుంటారని తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయినా ఆదివారం మట్టి తరలిస్తున్నారని సమాచారం అందడంతో రెవెన్యూ సిబ్బందిని పంపించాం. వారిని మట్టి తరలించే వారు లెక్కచేయలేదని తెలిపారు.



మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్